

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 10 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

బహమనీ సామ్రాజ్యము అంతఃకలహాలతో ఐదు రాజ్యాలుగా విడిపోయి, అహ్మద్ నగర్, బీదర్, బీరార్, బీజాపూర్, గోల్కొండ అనే ఐదు స్వతంత్ర సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. బహమనీ సుల్తాన్ మహమ్మద్ షా కొలువులో పనిజేస్తున్న కులీ కుత్బుల్ ముల్క్ 'కుతుబ్ షాహీ' అని రాచరిక నామాన్ని స్వీకరించి, గోల్కొండ సామ్రాజ్యాన్ని ఏర్పాటు జేసుకున్నాడు. అతను మధ్య ఆసియాలోని తుర్కమెనిస్తాన్ నుండి భారతదేశానికి వలసవచ్చిన షియా తెగకు చెందిన ముసల్మాన్. తనవారితో వచ్చి ఢిల్లీ పాదుషా నీడన చేరాడు ముందు. అక్కడనుండి దక్షిణాదికి వచ్చి, బహమనీ సుల్తానుల పంచన జేరాడు. బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నం ఐనప్పుడు స్వతంత్ర సుల్తానుగా ప్రకటించుకుని గోల్కొండ సామ్రాజ్యాన్ని పాలించడం మొదలుబెట్టాడు.

అంతకుముందు కాకతీయ సామ్రాజ్యంలో ప్రధానమైన కోటగా ఉన్నది గోల్కొండ. కాల క్రమంలో ముసునూరి నాయకుల ఆధీనంలోకి వచ్చింది. బహుమనీ సుల్తానులతో జరిగిన యుద్ధంలో పరాజయం అంచులకు చేరుకున్నాడు ముసునూరి కాపనీడు. సంధి చేసుకోవలసి వచ్చింది. అప్పటినుండి హిందువుల చేతిలోనుండి దూరమైంది గోల్కొండ సామ్రాజ్యం. బహమనీ సుల్తానుల నుండి కుత్బుల్ ముల్క్ చేతికి చిక్కి, కుతుబ్ షాహీ వంశస్థుల వశమైంది.

కులీ కుత్బుల్ ముల్క్ తన పెద్దకొడుకు యవ్వనంలోనే మరణించడంతో తన రెండవకొడుకు ఐన కుతుబుద్దీన్ ని యువరాజును చేశాడు. మూడవ కొడుకైన జంషెద్ అలీ అసూయతో తన అన్న కుతుబుద్దీన్ రెండు కండ్లు పీకేశాడు! ఆ అఘాయిత్యంతో కోపించి తనను ఖైదు చేసిన తండ్రిని గోల్కొండ కోటలోనే జామియా మసీదులో నమాజు చేస్తుండగా చంపించి, తను 'జంషెద్ కులీ కుతుబ్ షా సుల్తాన్' అయినాడు. గోల్కొండ కోట రక్షణాధికారి ఐన 'మీర్ అహమ్మద్ రందానీ' ఈ ఘాతుకంలో సహకరించాడు. ఒక సోదరుడు 'ఇబ్రహీం కులీ కుతుబ్ షా' పారిపోయి అప్పటి విజయనగర సామ్రాజ్య పాలకుడు ఐన 'రామరాయలు' పంచన చేరాడు. అత్యంత క్రూరుడు అని పేరుపొందిన జంషెద్ అలీ చివరి రోజుల్లో రాచపుండు వలన మరణం సమీపిస్తున్నకొద్దీ మరింత క్రూరుడు అయినాడు, ఆ వ్రణం బాధను మరచిపోవడానికి మద్యం, మగువ, ఇలా వ్యసనాలపాలై ఘోరమైన చావు చచ్చాడు.

జంషెద్ కులీ మరణానంతరం అతని ఏకైక కుమారుడు ఏడేళ్ళ బాలకుడు 'సుభాన్' చక్రవర్తి అయినాడు. 'ఛోటామాలిక్' గా పిలువబడిన సుభాన్ బాలకుడు కనుక రక్షకునిగా నియమింపబడిన సైఫ్ ఖాన్ బాలకుని హత్యకు కుట్ర చేయడంతో నమ్మకస్తులైన అధికారులు, ఆతని బాబాయి, జంషెద్ తమ్ముడు, పారిపోయి రామరాయల ఆశ్రయం పొందిన 'ఇబ్రహీం' ను పిలిపించి రాజ్యవ్యవహారాలను చక్కదిద్దే బాధ్యతను స్వీకరించమని కోరారు. ఈ లోపు 'ఛోటామాలిక్'' ఏడేళ్ళ వయసులోనే అనారోగ్యంతో మరణించడంతో, ఇబ్రహీం కులీ'ని గద్దెనెక్కించారు, అతను ఇబ్రహీం కులీ కుతుబ్ షా' గా నాలుగవ సుల్తాన్ అయినాడు.

ఇబ్రహీం కులీ కుతుబ్షా భాగీరథి అనే హిందూ స్త్రీని వివాహం చేసుకున్నాడు, ఆమెతో కలిగిన మహమ్మద్ కులీ ని ఆతని అనంతరం హిందూ అధికారుల వర్గం మద్దతునిచ్చి సుల్తానును చేసింది. ఇబ్రహీం కులీ రామరాయల ఆశ్రయంలో ఉన్నప్పుడుతెలుగు మీద ప్రేమను పెంచుకున్నాడు. రామరాయల భార్య ఇబ్రహీం కులీని స్వంత కుమారుడిగా చూసుకుంది, 'షహజాదా' అని పిలిచేది! ఆమె భర్తనే, తనకు కష్టకాలంలో యవ్వనంలో ఆశ్రయమిచ్చిన రామరాయలనే ఇబ్రహీం కులీ కుతుబ్ షా తళ్ళికోట యుద్ధంలో స్వయంగా సంహరించాడు,

ఆ యుద్ధంతోనే విజయనగర సామ్రాజ్యం అంతమయింది!

ఇబ్రహీం కులీ కుతుబ్ షా అనంతరం సుల్తాన్ ఐన 'మహమ్మద్ కులీ కుతుబ్ షా' ఐదవ సుల్తాన్. భాగమతి అనే బంజారా యువతిని ప్రేమించి వివాహమాడి, ఆమె పేరుతో 'భాగ్యనగర్' నిర్మాణం చేశాడు, చార్మినార్ ను నిర్మించాడు, ఉర్దూ తెలుగు భాషలలో గొప్ప కవిత్వం వ్రాశాడు. తన ఉర్దూ కవితల సంపుటిని కూడా ముద్రించాడు.

'మహమ్మద్ కులీ కుతుబ్ షా' కు కుమారులు లేనందున తన అల్లుడైన 'మహమ్మద్ కుతుబ్ షా'ను తన వారసునిగా, ఆరవ సుల్తాన్ గా చేశాడు. మహమ్మద్ కుతుబ్ షా అనంతరం అతని కుమారుడు 'అబ్దుల్లా కుతుబ్ షా' ఏడవ సుల్తాన్ అయినాడు. ఈతను కూడా కవి, సంగీత, నాట్య కళా ప్రియుడు. ప్రేమమతి, తారామతి అనే ఇద్దరు హిందూ స్త్రీలను వివాహం చేసుకున్నాడు. పదకవితలతో ప్రసిద్ధుడైన క్షేత్రయ్యను తన కొలువుకు రప్పించి సత్కరించాడు.

అబ్దుల్లా కుతుబ్ షా అనంతరం ఆతని అల్లుడు 'అబుల్ హసన్ కుతుబ్ షా' ఇప్పుడు ఎనిమిదవ సుల్తానుగా గోల్కొండ సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు!

నూటయాభై సంవత్సరాలుగా ప్రవహించిన రుధిర వాహినులు రాయల మనసులో సుడిగుండాలైనాయి. తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు, స్నేహితులు పరస్పరం విచ్చుకత్తులతో కుత్తుకలు కోసుకుంటున్న దృశ్యాలు, విందులు, విలాసాలు, నృత్యగానాలు, కామినులు, కౌగిళ్ళు, ఆర్తనాదాలు, కనులను, మనసును, చెవులను నింపి కలవరం కలిగించాయి, కర చరణాదులను కంపింపజేశాయి. ఇంకెన్ని తలలు తెగాలి? ఇంకెంత రుధిరం ప్రవహించాలి? ఇంకెన్ని మంగళసూత్రాలు తెగాలి? ఇంకెన్ని చితులు జీవ రహితులతో, పతి విరహితలతో దహించిపోవాలి? ఆయనకు ఒక్క నిముషంపాటు తన ఖడ్గాన్ని, కవచాన్ని ముక్కలు ముక్కలు జేసి సుదూర వనాంతాలకు పారిపోవాలి అనిపించింది, మానవుల మీద అసహ్యం కలిగింది, ' రామా! నీ సన్నిధి ప్రసాదించు ప్రభూ' అప్రయత్నంగా ఆయన మనసు బాధగా ఆర్తిగా మొరబెట్టింది.

# (11)

అసంకల్పితంగా నలిగిన మనసు చేసిన విన్నపం అప్రయత్నంగా ఒక దీర్ఘమైన నిట్టూర్పు రూపంలో వెలువడింది కృష్ణరాయల నుండి. అక్కన్న మాదన్నలు విచిత్రంగా చూశారు ఆయనవంక. సమర్థ రాముడు చిరునవ్వుతో 'కృష్ణోబా! రాముని సన్నిధికి నీ మనసు ఉరకలెత్తుతున్నది! ఎప్పుడు ఎవరికీ ఏమి ఇవ్వాలో, ఎవరినుండి ఏమి తీసుకోవాలో రఘువీరునికి తెలుసు. అంతా ఆయన యిచ్చ మేరకే జరిగేది. ఆయన ఆజ్ఞ కోసం ఎదురుచూడడమే మనము చేయవలసింది' అన్నాడు, మనసులను చదివే మాంత్రికుడిలా. మాదన్నవైపుకు తిరిగాడు.

' మాధోబా! శతృవులను పెంచుకోవడం మంచిది కాదు. శత్రువును కాక శత్రుభావాన్ని తుంచడానికి ప్రయత్నించేవాడికి ఆపద రాదు. కులాన్ని, మతాన్ని కాక వ్యక్తిత్వాన్ని, విశ్వసనీయతను పరిగణలోకి తీసుకుని మెలగండి!'

' అదే చేస్తున్నాము గురుదేవా! అందునా అన్నదమ్ముల కనులు పెరికినవాళ్ళు, కన్నతండ్రిని కడదేర్చినవారు అన్ని దిక్కులా పొంచి ఉన్నారు. మధ్యలో మీ దాసులం ఉన్నాము!' వినయంగా పలికాడు మాదన్న.

'పాలితులకు మత, వర్ణ విచక్షణ ఉండవచ్చునేమో గానీ, పాలకులకు ఉండకూడదు మాధోబా! అధికారములో ఉన్నవాడు అందరినీ సమానంగా ఆదరించాలి. అప్పుడే అందరి ఆమోదాన్నీ పొందుతాడు. గోల్కొండ సామ్రాజ్యంలో మొదటినుండీ సేవజేస్తున్నవారిని దూరంచేయకండి. ఆశ్రిత పక్షపాతాన్ని చూపకండి. ఉన్నతస్థానంలో ఉన్నవారు చేసే మంచీ చెడూ రెండూ వందలరెట్లుగా కనిపిస్తాయి. సహజశత్రువుల చిన్ని దోషాలకు పెద్ద శిక్షలు వేయకండి. వారు పరివర్తన చెంది మృదువుగా మెలగడానికి అవకాశాన్ని ఇవ్వండి. సన్నిహితుల దోషాలను విస్మరించకండి. అవకాశము వచ్చేవరకే నా అన్నవారు. అవకాశము దొరికితే ఎవరూ నీవారు కారు, నిన్ను ఉపేక్షించరు! బలమైన శతృవులను అడ్డుకోవడానికి భుజబలం, అధికారబలం మాత్రమే సరిపోవు, బుద్ధిబలం, నేర్పు కావాలి' మరొక్కమారు గంభీరంగా హితవు పలికాడు సమర్థరాముడు!

' శత్రువులు ఎంతటి బలవంతులైనా కావచ్చుగాక. అందరూ ఏకమై రావచ్చుగాక. మా తలలు తెగిపడినా సరే, మీ దాసులు..' అని అక్కన్న పలుకుతుండగనే ద్వారముబయట

ఎవరో పెద్దగా తుమ్మిన ధ్వని వినబడింది.

' జయ జయ రఘువీర సమర్థా!' అని పెద్దగా స్మరించాడు సమర్థ రాముడు.

' ... మీ దాసులు భయపడరు, మీ కార్యరంగమునుండి వెనుదిరుగరు' తన పలుకులను కొనసాగించాడు అక్కన్న.

మౌనం వహించి ఏదో ఆలోచనలో మునిగిపోయాడు సమర్థరాముడు. ఆయన భ్రుకుటి ముడిపడింది. ఎల్లపుడూ చిరునవ్వులు చిందే ఆయన ముఖం ఎందుకో కలవరపాటును సూచించింది. కొద్దిసేపు మౌనం అలుముకున్నది అక్కడ. బయట ప్రాంగణంలో సిపాయీలు లోగొంతుకతో మాట్లాడుకుంటున్న ధ్వనులు, గుఱ్ఱాల సకిలింతలు వినబడుతున్నాయి. విశాలమైన గవాక్షాలనుండి తెరలు తెరలుగా వీస్తున్న చల్లని గాలులు మామిడి వాసనలను, కోకిలల సరిగమలను అలలు అలలుగా మోసుకొస్తున్నాయి. బురుజులమీద పావురాల కువకువలు, రెక్కలచప్పుడు జోడువాయిద్యాల్లా వినిపిస్తున్నాయి.

నిశ్శబ్దాన్ని దూరంచేస్తూ, గొంతు సవరించుకుని 'మీ సన్నిధికి ఒక రాచ కార్యము మీద రావడమైంది స్వామీ!' అన్నాడు మాదన్న.

'రాచకర్యమును నెరవేర్చగలిగినవాడు రాజరాజు, శివాజీ మహారాజు మాత్రమే' అన్నాడు సమర్థుడు చిరునవ్వులు చిందిస్తూ.

' మీరు సర్వజ్ఞులు. మీకు తెలియనిది లేదు. ప్రత్యేకముగా తెలియజేయాల్సిందీ లేదు, ఆ రాజరాజు రక్షణకోసమే మీ సన్నిధికి వచ్చాము ' అబ్బురంగా, ఆనందంగా అన్నాడు అక్కన్న.

' అటు బీజాపూరును యిటు గోల్కొండను స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మిగిలిన దక్షిణాపథం మొత్తాన్ని చేజిక్కించుకోడానికి ఔరంగజేబ్ ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. డబ్బులు, మామిడిపండ్ల రాశులతో ఇంకా ఎక్కువకాలం ఢిల్లీ సుల్తానును సంతృప్తి పరిచే పరిస్థితి కనబడడంలేదు. బహమనీ సామ్రాజ్య పతనం తర్వాత ముక్కలు చెక్కలైన సామ్రాజ్యాలకు పరస్పరం విశ్వాసం లేదు. ఈ స్థితిలో ఛత్రపతి మాత్రమే గోల్కొండకు చేయూతనివ్వగలడు అనుకుంటున్నాను స్వామీ! మీ ఆజ్ఞ మాత్రమే ఛత్రపతిని సానుకూలుడిని చేయగలదు' తను వచ్చినపనిని అప్పుడు బయటపెట్టాడు మాదన్న.

కనులుమూసుకుని రెండు నిముషములు అలోచించి, ' ఛత్రపతికి విజ్ఞాపనను పంపండి. నేనూ సందేశం పంపుతాను. ఛత్రపతి పదస్పర్శతో భాగ్యనగరము పులకించే తరుణం ఆసన్నమైంది ' అన్నాడు సమర్థరాముడు ప్రసన్నంగా. వెన్నెల కిరణాలు సోకిన కలువలలా విచ్చుకున్నాయి శ్రోతలు ముగ్గురి ముఖాలు.

.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS